ప్రజాశక్తి
బుధవారం 12 నవంబర్ 2025
అనంతపురం



అగ్నిమాపక సిలిండర్ పేలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అనంతపురం

అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మంటలను ఆర్పేందుకు ఏర్పాటు చేసే అత్యవసర గ్యాస్ సిలిండర్ పేలి జిలాన్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. అనంతపురం నగరం పరిధిలో తపోవనంలో మంగళవారం నాడు ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తపోవనంలో అనంతపురం నగరానికి చెందిన వెంకటకృష్ణ అనే వ్యక్తి ఒక ఇంటిని అద్దెకు తీసుకుని అగ్నిమాపక సిలిండర్లలో గ్యాస్ నింపే పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో గుంతకల్లు పట్టణానికి చెందిన జిలాన్ పనిచేస్తున్నాడు. మంగళవారం నాడు సిలిండర్‌లో మోనో అమ్మోనియం పాస్పేట్‌ను నింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో గ్యాస్ నింపుతున్న జిలాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇక్కడ గ్యాస్ ఫిల్లింగుకు సంబంధించి ఎటువంటి అనుమతుల్లేవని ప్రాథమిక విచారణ గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలేపాలెంలో టంగ్‌స్టన్ తవ్వకాలు

హిందుస్థాన్ జింక్‌కు అనుమతులు



టంగ్‌స్టన్ ముడిఖనిజం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం బాలేపాలెంలో టంగ్‌స్టన్ ఖనిజం తవ్వకాలకు హిందూస్థాన్ జింక్ సంస్థ అనుమతులు పొందింది. ఈ మేరకు మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలో 308.30 హెక్టార్లలో తవ్వకాలు, అన్వేషణ కోసమని కాంపోజిట్ లైసెన్సును మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది మేజరు మినరల్ పరిధిలోకి రావడంతో కేంద్ర ఖనిజ మంత్రిత్వ శాఖ గతేడాది ఈ యాక్షన్ నిర్వహించింది. ఇందులో 0.655 శాతం అధికంగా హిందుస్తాన్ జింక్ సంస్థ కోటేషన్ దాఖలు చేసింది. దీంతో ఆ సంస్థకే కాంట్రాక్టును అప్పగించారు. ఈ కంపెనీ రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో టంగ్‌స్టన్ ఖనిజ అన్వేషణతోపాటు తవ్వకాలు చేపట్టేందుకు వీలుంటుంది. అనుమతులిచ్చిన 308.30 హెక్టార్లలో రైతుల పొలాలుంటే వారి నుంచి అనుమతులను ముందుగా ఆ కంపెనీనే తీసుకోవాల్సి ఉంటుంది.

పారిశ్రామిక అవసరాల్లో టంగ్‌స్టన్ వినియోగం అధికం

టంగ్‌స్టన్ అనే లోహం దృఢంగా ఉంటుంది. ఎక్కువ వేడిని తట్టుకుని నిలబడగలిగే లోహం. దీనినిఎక్కువగా పారిశ్రామిక యంత్రాల తయారీలో , ఎలక్ట్రికల్ విభాగాల్లోనూ కట్టింగ్ చేసే యంత్రాల్లోనూ వినియోగిస్తారు. ఇప్పటి వరకు దేశంలో లభ్యత ఆశించినంత లేకపోవడంతో బయట నుంచి దిగుమతులు చేసుకుంటూ ఉన్నారు. ఇది ఇక్కడ లభిస్తే కొంత వరకు దేశీయంగా లోటు భర్తీ చేసుకునేందుకు వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇది లభిస్తే జిల్లా పరిధిలో అదనంగా కొత్త లోహం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు ఇనుము, బంగారం, వజ్రాల అన్వేషణ, తవ్వకాలు నడుస్తూ వచ్చాయి. తాజాగా ఇప్పుడు టంగ్‌స్టన్ అనే ఖనిజమున్నట్టుగా భూగర్భ ఖనిజ శాఖ భావిస్తోంది. ఈ మేరకు ఈ ఖనిజం తవ్వకాలు, అన్వేషణ కోసం కేంద్ర ప్రభుత్వం హిందుస్తాన్ జింక్ సంస్థకు కట్టబెట్టింది. ఇప్పటికే భూగర్భ ఖనిజ సంస్థ ప్రాథమికంగా సర్వేలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అందులో వచ్చిన ప్రాథమిక నిర్ధారణలను బట్టి ఇక్కడ టంగ్‌స్టన్ ఉండవచ్చునని భావించి ఇప్పుడు యాక్షన్ చేపట్టారు. కాంపోజిట్ లైసెన్సు పొందిన ఈ సంస్థ రాబోయే రోజుల్లో మరింతగా శోధించి ఏ మేరకు ఉందన్నది నిర్ధారించుకునేందుకు ఈ లైసెన్సును పొందింది. అక్కడ పూర్తి స్థాయి ఫలితాలొస్తే ఖనిజ తవ్వకాలను ఆ సంస్థనే చేపట్టే అవకాశాలున్నాయి.

మైనింగుతో పర్యావరణంపైనా ప్రభావమెంత ?

టంగ్‌స్టన్ మైనింగు వలన పర్యావరణంపైనా ప్రభావముండే అవకాశముందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. తమళనాడులోని దిండిగల్ ప్రాంతంలో ఇదే రకంగా మైనింగుకు అనుతులొస్తే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మైనింగు వలన నీరు, పర్యావరణంపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం..

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పెదఈర్లపాడు నుండి మంగళవారం 50 ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలు, శంఖు స్థాపనలు చేసే కార్యక్రమంలో వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతపురము నగరంలోని జెఎన్టీయూ మార్గంలో ఉన్న సిరికల్చర్ కార్యాలయంలోని ప్రాంగణంలో ఏపీఐఐసీకి సంబంధించి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు శంఖుస్థాపన చేసే కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానంగా యువత భవిత కోసం, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈనెల 13, 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో జరగబోయే సిఐఐ సమ్మేళనంలో దాదాపు 55 దేశాలకు సంబంధించిన వాణిజ్యం చూసేటటువంటి మంత్రులు వస్తున్నారని చెప్పారు. ఆయా ఆ దేశాలకు సంబంధించిన వాణిజ్య బృందాలు, మనదేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించి పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడిదారులు వస్తున్నారన్నారు. దాదాపు రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి విశాఖపట్నంలో ఒప్పందాలు చేసుకోబోతున్నారన్నారు. పని చేసే ప్రభుత్వము వస్తే ఎంత మంచి మార్పు ఉంటుంది అనేది ఈ ప్రభుత్వాన్ని చూసి గమనించాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త యుగం తయారవుతోందని, అందుకు ముందుగానే పిల్లలు తయారయ్యేలా సీఎం చంద్రబాబు గూగుల్ సంస్థ డేటా సెంటర్ పెట్టారని అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువస్తే ఎకానమీ పెరుగుతుందని, పరిశ్రమలు కట్టే టాక్స్ లు, జిఎస్టి, ఇన్కమ్ టాక్స్ లతో మనం రోడ్లు వేసుకోగలుగుతున్నామని, బ్రిడ్జిలు, కాలువలు కట్టుకోగలుగుతున్నామని, ఇవన్నీ నిరంతరం కొనసాగాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తూనే ఉండాలని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎం, మంత్రి లోకేష్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేలా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రూ.16 కోట్ల నిధులతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను సిరికల్చర్ కార్యాలయంలోని ప్రాంగణంలో 4 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్నారన్నారు. దీని గురించి నిరుద్యోగ యువతీ యువకులకు తెలియజేయాలన్నారు. ఇందులో ఎక్కువ యువత పాల్గొని ప్రమోట్ చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను ఉపయోగించుకోవాలని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ 24వ వార్డు కార్పొరేటర్ రామాంజనేయులు, బెస్త కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పవన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, ఆర్డీఓ కేశవనాయుడు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ నాగ కుమార్, మేనేజర్లు సాయిసాగర్, శివ మోహన్‌కృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ నరసింహులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఒఎంసి సరిహద్దుల పరిశీలన

ప్రజాశక్తి - డి. హీరేహాల్

మండలంలోని ఓబులాపురం సిద్దాపురం గ్రామాల పరిధిలో ఉన్న వివాదాస్పద మైనింగ్ సరిహద్దులను సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ కూర్మనాథ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివాదాస్పదమైన మైనింగ్ లీజుల సరిహద్దులను గుర్తింపు కోసం గత పది రోజులుగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సర్వేలో అత్యధిక పరిజ్ఞానంతో ఉన్న లైడర్డ్, డ్రోన్లను ఉపయోగించి సర్వే చేసి సరిహద్దురాళ్లను గుర్తించినట్లు తెలిపారు వీటిని కూడా పాత రికార్డులు ఆధారంగా ఖచ్చితమైన స్థానంలో ఉన్నాయా లేదా అన్న నిర్ధారణకు వచ్చిన తరువాత మైనింగ్ లీజు దారులు అక్రమంగా తవ్వకాలు చేపట్టారా లేదా అన్నది తేలుతుందన్నారు. ఈ విషయం తేల్చిన తరువాత పూర్తిస్థాయి నివేదికను తయారుచేసి ఆ నివేదికను సుప్రీంకోర్టుకు ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి వెంకటేశ్వర్లు, జెడి శ్రీనివాసులు చౌదరి, సర్వేఆఫ్ ఇండియా నిత్యానంద, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గనుల సరిహద్దు మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికి ఐక్యఉద్యమాలే మార్గం

సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

'అనంత'లో ఘనంగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ హమాలీలు హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని అప్పుడే పాలక ప్రభుత్వాలు స్పందిస్తాయనిసివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభ అనంతపురం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో ఘనంగా జరిగింది. సీతారాం ఏచూరి ప్రాంగణంలో సిఐటియు జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆ సంఘం గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సివిల్ సప్లయ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఉదయభాస్కర్‌రావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరయ్యారు. తొలుత అమరులకు సంతాప తీర్మాణం ప్రవేశపెట్టగా మహాసభ నివాళులు అర్పించింది. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరరావు మూడు సంవత్సరాల్లో సంఘం ఆధ్వర్యంలో హమాలీల పక్షాన చేసిన పోరాటాలు, సాధించిన హక్కులు తదితర అంశాలపై నివేదిక ప్రవేశపెట్టి వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీలు శ్రమకు తగ్గ వేతనం అందడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అయితే మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు అదానీ, అంబానీ వంటి వారిని ప్రోత్సహిస్తూ శతకోటీశ్వరులుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ఉన్న కొద్ది మంది సంపన్నులకు 2 శాతం పన్ను విధించినా ఆ సొమ్ముతో దేశంలో, రాష్ట్రంలో ఉచితంగా నాణ్యమైన, మెరుగైన ప్రభుత్వ విద్య, వైద్యం, యువతకు గౌరవ ప్రదమైన ఉద్యోగాలు, ఉద్యోగ కార్మికులకు పెన్షన్‌లు, పేద ప్రజలకు పించన్‌లు శాశ్వతంగా అందించవచ్చన్నారు. కార్మికులకు పని తగ్గ వేతనం, భద్రత కల్పించడం లేదన్నారు. అదే కేరళా రాష్ట్రంలో కార్మిక, రైతు, ప్రజా పక్షపాత పాలక ప్రభుత్వం పని చేస్తుండటంతో అక్కడ పేదరిక నిర్మూలన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. అమెరికాలోని న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్టు భావాలు కలిగిన జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం చూస్తుంటే సోషలిస్టు విధానం, సిద్ధాంతాన్ని సమాజంకాంక్షిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దేశంలో కూడా కార్మికుల పక్షపాత ప్రభుత్వాలను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని తెలిపారు. న్యాయం చేయకపోగా కష్టజీవులు, శ్రామికులు, కార్మికుల మధ్య ఐక్యత లేకుండా చీలిక తెచ్చి బానిసత్వంలోకి నెట్టివేసే ధోరణులు అనుసరిస్తున్నాయని విమర్శించారు. అందు కోసమే కార్మిక లోకం ఐక్యమత్యంగా ఉండి పోరాడి హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హమాలీలను బరువులు మోసే గాడిదల్లాగా, ఎద్దులాగా భావించాలని చూస్తే ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. హమాలీలు రాజకీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు సివిల్ సప్లయ్ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలు చిన్న చూపు చూడటం అన్యాయంగా ఉందన్నారు. కార్మికులకు వేతనాలు, కనీస సౌకర్యాలు అమలు చేయమంటే ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. సమాజానికి కీలకమైన సేవలు అందిస్తున్న సివిల్ సప్లయ్ హమాలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఆయా జిల్లాల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తీర్మాణాలు ప్రవేశపెట్టి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారు.

25 మందితో నూతన కమిటీ : ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కె.ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులుగా ఆర్.కృష్ణ (కర్నూలు), ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు (అనంతపురం) జొన్నలగడ్డ కృష్ణ(కృష్ణ), శేఖర్ (ఏలూరు), రమేష్(పల్నాడు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉదయ భాస్కర్‌రావు (పశ్చిమగోదావరి), రాష్ట్ర కార్యదర్శులుగా రత్నరాజు (బాపట్ల), బి.రమేష్ (ఎన్టీఆర్), నాగరాజు (శ్రీసత్యసాయి), శ్యామ్ (తూర్పుగోదావరి), రమేష్ (నంద్యాల), కోశాధికారిగా ఈ.ఆంజనేయులు (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా శంకర్(కృష్ణా), ఈశ్వర్ (అనంతపురం), ఎస్.వీర్రాజు (తూర్పుగోదావరి), గోపాలరావు (ప్రకాశం), రాజు (పశ్చిమగోదావరి), శ్రీనివాస్ (పశ్చిమగోదావరి), నరేష్(కర్నూలు), వెంకటేష్(ఎన్టీఆర్), దాదాపీరా(బాపట్ల,) ఎం.రాంబాబు(ఏలూరు), గోపాల్(నంద్యాల)ను ఎన్నుకున్నారు.



మహాసభలకు హాజరైన ప్రతినిధులు



సివిల్‌సప్లయ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ముందు మురుగు.. కింద ఊటనీరు..

కల్లూరు పాఠశాలలో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని కల్లూరు ఎంపియుపి పాఠశాల ముందు మురికినీటి మధ్యనే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. ఎందుకంటే పాఠశాల భవనం కింద నుంచి ఊట నీరు వస్తుండటంతో పాఠశాల ప్రాంగణమంతా మురికి చేరింది. దీంతో అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఎటుచూసినా వర్షం నీటితో నిండిపోయింది. పక్కనే ఉన్న పొలాల నీరు కూడా పాఠశాల వైపే వస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈనేపథ్యంలో విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ఆవరణలోని నీరు రాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.





పాఠశాల ముందు మురికి, ప్రవహిస్తున్న ఊటనీరు

పెండింగ్ కేసులు పరిష్కరించండి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా పెండింగ్ కేసులు పరిష్కరించడంతోపాటు రికవరీ పెంచాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య కసులు, పోక్సో, రేప్ కేసులు, డెకాయిట్, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, ఛీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ కేసులపై సమీక్షించారు. కేసుల ఛేదింపు, పరిష్కారం, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అందిస్తూ దిశానిర్దేశం చేశారు. అనంతరం నిందితులను త్వరగా అరెస్ట్ చేయడం, దర్యాప్తు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయడం, పెండింగ్ కేసులు తగ్గించడం, తదితర విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమీక్షలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, రవిబాబు, ఎ.శ్రీనివాస్, వెంకటేశులు, మహబూబ్‌బాషా, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్పీ పి.జగదీష్

ఎంబిబిఎస్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- అనంతపురం

ఎంబిబిఎస్-2024 బ్యాచ్‌కు సంబంధించిన ప్రథమ సంవత్సరం యూజీ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 94 శాతం వైద్య విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 17 మంది డిస్టింక్షన్ సాధించారు. అలాగే యుజి ఎంబిబిఎస్-2023 బ్యాచ్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 95శాతం ఉత్తీర్ణత సాధించగా 9 మంది డిస్టింక్షన్ సాధించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన వైస్ ప్రిన్సిపాల్, ఫార్మకాలజీ విభాగాధిపతి ఎస్.షారోన్‌సోనియా, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.శాంతిరెడ్డి, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ శివశంకర్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని, తదితరులు వైద్య విద్యార్థులను అభినందించారు.



ఎంబిబిఎస్‌లో ఉత్తీర్ణత సాధించిన వైద్యులను అభినందిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.షారోన్‌సోనియా, తదితరులు

మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్‌పై దాడి

ప్రజాశక్తి - తాడిపత్రి

వైసిపి కార్యకర్త, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ బోడాయిపల్లి ఓబుల్ రెడ్డిపై మంగళవారం ఉదయం దాడి జరిగింది. మంగళవారం ఉదయం ఓబుల్ రెడ్డి వాకింగ్ వెళ్లగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా ఓబుల్ రెడ్డి పై పిడుగులు గుద్ధి దాడికి పాల్పడి రోడ్డు పక్కన పడేసి వెళ్లారు. అటుగా వెళుతున్న వాకర్స్ ఇచ్చిన సమాచారంతో ఓబుల్ రెడ్డి స్నేహితులు అక్కడికి చేరుకొని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం తరలించారు. గాయపడిన ఓబుల్ రెడ్డిని తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ దాడులకు పాల్పడుతూ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేసి వైఎస్ఆర్సిపి కార్యక్రమాలు తాడిపత్రిలో నిర్వహించకుండా చేయాలనుకోవడం సరైనది కాదన్నారు. ఫ్యాక్షనిజాన్ని వ్యతిరేకిస్తున్నామంటూ ఫ్యాక్షనిజానికి బీజాలు పడేలా తాడిపత్రిలో వైసిపి కార్యకర్తల పైన దాడులకు పాల్పడుతున్న నాయకులు ఈ దాడులను సమాధానం చెప్పాలన్నారు. ఓబుల రెడ్డి వైసిపిలో క్రియాశీలక కార్యకర్త అని పార్టీ కార్యక్రమాలు చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. వైసిపికి వస్తున్న ప్రజాదరణను చూసి దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు.



దాడిలో గాయపడిన ఓబుళరెడ్డి

జలచోరీకి పాల్పడితే చర్యలు : డిపిఒ


స్థానికులతో మాట్లాడుతున్న డిపిఒ నాగరాజునాయుడు

ప్రజాశక్తి-పుట్లూరు

ఎక్కడన్నా పంచాయతీ కొళాయిలకు వచ్చే నీటి చోరీకి పాల్పడితే చర్యలు తప్పవని డిపిఒ నాగరాజునాయుడు హెచ్చరించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పి.చింతలపల్లికి చెందిన సంజీవరెడ్డి గ్రామానికి రావాల్సిన నీరు రాకుండా సర్పంచు రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పొలంలోకి వెళ్తున్నాయని ఫిర్యాదు చేశాడు. ఇందుకు స్పందించిన డిపిఒ మంగళవారం గ్రామానికి చేరుకుని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు చెప్పినచోట పైపులైను తీసి పరిశీలించాలని డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కి సూచించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ఎక్కడన్నా నీటి అక్రమాల పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా లీకేజీలు ఉంటే సరిచేసి ట్యాంకుకు నీరు వెళ్లేలా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు.

'భావన' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పట్టణంలోని భావన ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంఇఒ మహమ్మద్ ఇర్షాద్‌కు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగి శివ మాట్లాడుతూ ఒక పాఠశాలకు అనుమతి తీసుకుని రెండుచోట్ల పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. అంతేకాక ఆదివారాల్లో కూడా 9, 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆయా విషయాలపై ఎంఇఒలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పాఠశాల నిర్వహణ తీరుపై ప్రశ్నించినందుకు విద్యార్థి సంఘాల నాయకులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. కావున వెంటనే భావన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ స్థానిక నాయకులు వలి, అనిల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నీరు ఎప్పుడిస్తారో చెప్పండి..

మాజీమంత్రి సాకే శైలజనాథ్


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు మండల రైతాంగానికి సాగు, తాగునీరు ఎప్పుడిస్తారో చెప్పాలని మాజీమంత్రి సాకే శైలజనాథ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలోని హెచ్చెల్సీ కార్యాలయంలో మంగళవారం అధికారులను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా పంటల సాగు కాలం పూర్తవుతున్నా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి సాగు, తాగునీటి కోసం పుట్లూరు మండలంలోని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, తదితర గ్రామాల చెరువులు పూర్తిగా ఎండిపోయాయన్నారు. దీంతో సాగునీటి కొరత ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో సుబ్బరాయసాగర్ రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE CIVIL JUDGE (JUNIOR DIVISION): GOOTY
I.A.317/2023 in O.S.197/2023

Between:
A.Adi Narayana Reddy and 3 Others
...Plaintiffs/Petitioners
AND
Dudekula Mastanamma and 2 Others
...Defendants/Respondents

1వ ప్రతివాదికి నోటీసు

R1&D1: Dudekula Masthanamma W/o Pedda Imam Sab, Aged 57 Years, Bussiness, R/o D.No 10-28-8, Kakkalpalli Colony (Rural), Vidhyanagar, Georgepeta Road, Ananthapuramu Dist.
పై దావాలోని వాదులు దావాను డిక్లనేషన్ ఆఫ్ టైటిల్, డెలివరీ పొసేషన్, పర్మనెంట్ ఇంజక్షన్ కొరకు దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ యొక్క హాజరు నిమిత్తము తేదీ 18-11-2025 నాటికి వాయిదా వేసియున్నారు. ఆ దినం మీరు పై కోర్టు యెదుట ఉదయం 10:30 గంటలకు వకీలు ద్వారా గానీ లేదా స్వయముగా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో పై దావాను మీ పరోక్షమందు తీర్మనం కాగలదు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
J.KRANTHI KUMAR,
P.PRAVALLIKA,
C.MURALI,
Advocates for the Plaintiffs

ఆశ్రమానికి నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఫ్రీడం అండ్ ఈక్వాలిటీ (స్వేచ్ఛ సమానత్వ సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్ పుట్టినరోజు పురస్కరించుకుని స్థానిక కాట్నేకాలువలో ఉన్న ఆశ్రమ అనాథ ఆశ్రమానికి మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఇందులో భాగంగా ఫ్రీడమ్ అండ్ ఈక్వాలటీ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు ఎస్.రామునాయక్, ప్రధాన కార్యదర్శి ఎస్.లలితాబాయి, అసోసియేట్ ప్రెసిడెంట్ బన్సీలాల్ నాయక్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ మానసశ్రీతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి పుట్టిన రోజును ఈవిధంగా జరుపుకోవడం ఆనవాయితీ వస్తోందన్నారు. గతంలో సర్వజనాసుపత్రిలో రోగులకు అన్నదానం, వృద్ధాశ్రయంలో సరుకులు, బెడ్‌సీట్ వంటివి పంచి తోచినంత సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.


నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం


లక్ష్మీనారాయణ

పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఎన్నికల అధికారి వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా కెంచే లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె కిషోర్‌బాబు, సహాధ్యక్షులుగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా కె.వీరేష్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, పి.రవికుమార్, సహ కార్యదర్శులుగా గంగాధర్‌గౌడ్, హనుమాన్ జి రావు, వై.కృష్ణమోహన్, ఎఎల్ పద్మావతి, వై.సురేష్ ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరు మూడేళ్లపాటు ఆయా పదవుల్లో కొనసాగుతారు.

ఎన్‌జిజిఒ మహిళా విభాగం అధ్యక్షులుగా చంద్రకళ


చంద్రకళ

ఎపి నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాయదుర్గం యూనిట్ మహిళా విభాగం అధ్యక్షులుగా ఎస్‌కె చంద్రకళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గంలో జి.శ్వేత, ఎం.లిజీ, సుచిత్ర, ఎం.కొల్లమ్మ, బి.సరోజ, డి.ఉమారాణి ఉన్నారు.

'దుర్గం'లో రూ.4,571కోట్లతో సోలార్ ప్రాజెక్టులు

సిఎం చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపన - పరిశ్రమల ఏర్పాటుపై ఎమ్మెల్యే హర్షం


వర్చువల్ శిలాఫలక ఆవిష్కరణలో ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా విద్యుత్ ఉత్పత్తి, వందలాది మంది ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రూ.4,571కోట్లతో పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమలకు వర్చువల్ రూపంలో సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. ఈలైవ్ కార్యక్రమానికి స్థానిక ప్రజావేదికవద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మార్కెట్ యార్డుచైర్మెన్ లక్ష్మిదేవి, ఆర్డీవో వసంతబాబు, నెడ్‌క్యాప్ పీడీ శివశంకర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఎకోరియన్, 0.2ఫవర్ ఎనర్జీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపనలో ఆయన ప్రసంగాలను తిలకించారు. నేరుగా వేలకోట్లకు సంబంధించిన పరిశ్రమల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రెండు మండలాల్లో ఎకోరియన్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన దేశ్రాజ్‌సోలార్‌ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, 0.2 పవర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు సీఎం చంద్రబాబు లైవ్‌లో వివరించారు. కంబదూరు, శెట్టూరు మండలాల్లో మొదటగా దేశ్రాజ్‌సోలార్ ఎనర్జీ ద్వారా 330.30మెగావాట్ల పవన విద్యుత్ ఉత్పాదకత కోసం రూ.2,920 కోట్లు సదరు సంస్థ పెట్టుబడులు పెట్టి 2027నాటికి పూర్తి చేసేప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా 0.2పవర్ ఎన్జి ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు 201.30మెగావాట్ల పవన విద్యుత్ ఉత్పాదకత రాళ్ల అనంతపురం, శెట్టూరు మండలాల పరిధిలో 1,650కోట్ల రూపాయలు పెట్టుబడులకు సంస్థలు ముందుకొచ్చాయన్నారు. ఈరెండు ప్రాజెక్టు పనులు 2027మార్చి నాటికి పూర్తికానున్నట్లు తెలిపారు. ఆయా సంస్థల ద్వారా ఏర్పాటుచేసే పరిశ్రమల్లో 635 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా నియోజకవర్గంలో బ్రైట్‌ఫ్యూచర్ అనే సంస్థ రూ.3800కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొస్తున్నట్లు ఇందుకు సంబంధించి కూడా అన్ని ఏర్పాట్లు తీసుకునే విషయమై చర్చించారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గానికి అభివృద్ధితోపాటు పరిశ్రమలు నెలకొల్పడంలో మహర్దశ ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు, సహకరించి అభివృద్ధికి, పరిశ్రమలకు తోడ్పాటునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు బాస్కర్, బాలకిషన్, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన నూనెలు అందించడమే ధ్యేయం

యోజిత్ నాచురల్స్ యజమాని సి.ఉమామహేశ్వర్




గానుగలో నూనెను ఆడిస్తున్న యోజిత్ నేచురల్స్ యజమాని సి.ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మార్కెట్‌లో లభిస్తున్న వాటికంటే స్వచ్ఛమైన నాణ్యత కలిగిన నూనెలు అందించడమే తన ధ్యేయమని నగరంలోని యోజిత్ నేచురల్స్ యజమాని సి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో గింజలు ఆడించిన తర్వాత వచ్చే నూనె (రీఫైన్డ్)ను వినియోగిస్తున్నారన్నారు. దీనివల్ల నూనె థిక్‌నెస్ తగ్గిపోయి పల్చగా తయారై వంటలు చేసేటప్పుడు ఎక్కువగా వినియోగించాల్సి వస్తుందన్నారు. కానీ రీఫండ్ చేయకుండా గానుగ నుంచి తీసిన నూనె వడబోసి ఇస్తే వంటల్లో తక్కువ మోతాదులో వినియోగించవచ్చన్నారు. గింజలు గానుగలో వేసి నూనె తీయడాన్ని కోల్డ్‌ప్రెస్డ్ అంటారన్నారు. ఇది రెండు రకాలు.. ఒకటి వుడ్ ప్రెస్డ్, రెండవది ఐరన్ ప్రెస్డ్ అన్నారు. మొదటిదానిలో రాయితో తయారు చేసిన రోలు ఉంటుందని, దాంట్లో గింజలు వేసి రుబ్బేది చెక్కతో తయారై ఉంటుందన్నారు. ఇది విద్యుత్తు మోటార్‌తోనే పని చేస్తున్నప్పటికీ ఇది నెమ్మదిగా తిరుగుతూ గింజల నుంచి పూర్తిస్థాయిలో నూనెను తీస్తుందన్నారు. ఇది ఉపయోగించుకోవడానికి, ఆరోగ్యానికి చాలా మంచిది అన్నారు. ఇక రెండవ పద్ధతి రాతితో తయారు చేసిన రోలు, ఇనుముతో తయారు చేసినది. దీంట్లో రుబ్బడానికి ఉపయోగించేది కూడా ఇనుముతో తయారు చేసింది కావడంతో విద్యుత్ మోటార్ ఆన్ చేయగానే ఎక్కువ వేగంగా తిరిగి ఎక్కువ వేడి పుట్టి ఆ గింజల్లోని పోషకాలు పూర్తిగా నశించి పోతాయన్నారు. కాబట్టి ఈ పద్ధతిలో తయారు చేసిన నూనెలు ఆరోగ్యానికి మంచివి కావన్నారు. ఏ రకము నూనె వాడినా ఆరోగ్యానికి మంచిదే. చాలామంది వేరుశనగ నుంచి తీసిన నూనెలో కొవ్వు శాతం ఎక్కువ ఉంటుందనుకుంటారు.. అది కేవలం అపోహ మాత్రమే. వీటిలో అన్ని విటమిన్లతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు ఉంటాయన్నారు. కావున వేరుశనగ నుంచి తీసిన నూనెను వంటలో ఉపయోగించడమే మంచిది. అలాగే ఒకే రకమైన నూనెను వాడకుండా, మార్చి వాడటం మంచిదన్నారు. ఒకనెలలో ఇంటికి నాలుగు కిలోల నూనె అవసరమైతే రెండు కిలోలు వేరుశనగ.. రెండు కిలోలు నువ్వుల నూనె వాడటం మంచిది అన్నారు. తమ వద్ద వేరుశెనగ, కొబ్బరి, పొద్దు తిరుగుడు, నువ్వులు, వెర్రినువ్వులు, ఆముదం, బాదం, ఆవాలు వంటి నూనెలు తయారు చేసి అమ్ముతున్నట్లు వివరించారు.

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

విప్ కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని జామియా మహమ్మదీయ అరబియ మదరసా ప్రాంగణంలో జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమం కోసం రూ.5,212 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5వేల మంది ఇమాముల వేతనాల కోసం రూ.45 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అలాగే షాదీ ఖానాల నిర్మాణం, మైనార్టీ సంక్షేమం, ఇతరత్రా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఉర్దూ టీచర్ల కొరతను తప్పక అధిగమించడంతోపాటు ఉర్దూ స్కూళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మహమ్మద్ ఇర్షాద్, వెంకటరమేష్, మైనార్టీ నాయకులు కడ్డిపూడి మహబూబ్‌బాషా, జావీద్, జిలాన్, టిడిపి నాయకులు బండి కృష్ణమూర్తి, పొరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పట్టణంలోని బళ్లారి రోడ్డు ఆధ్యాత్మిక ప్రచార సేవాశ్రమం, సిద్దేశ్వర కాలనీ బయలు ఆంజనేయస్వామి ఆలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి విప్ కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం, బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.55 లక్షలతో రోడ్లను నిర్మిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు శారద, ప్రశాంతి, పద్మజ, మాజీ సభ్యులు హనుమంతు, భారతి, నాగమణి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, మున్సిపల్ ఇంజనీర్లు సురేష్, నరసింహులు, టిడిపి నాయకులు శంకర్, రాజశేఖర్, అదేప్ప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన నాయకుల శివమ్మకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను విప్ శ్రీనివాసులు మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జికాలవ సన్నన్న, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అజయ్‌పాటిల్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి (పివిఆర్) ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ అజయ్‌పాటిల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌వి ప్రసాద్ ఇన్స్టిట్యూట్ రాయదుర్గం విజన్‌సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో దాదాపు 290 మంది విద్యార్థులు, ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 32 మందికి శస్త్రచికిత్సలు, 129 మందికి కళ్లద్దాలు, ఆరుగురికి ఇతర కంటి పరీక్షలకు అవసరమని గుర్తించినట్లు కోఆర్డినేటర్ రఫీక్ తెలిపారు. కార్యక్రమంలో అజయ్ కుటుంబ సభ్యులు నరేష్‌రెడ్డి, షమీవుల్లా (జి.జి), వీరేష్, సాయి, దాదు, ఓంకార్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్లు కరిబసవ, మారెన్న, పంపావతి, క్యాంపెన్స్ ఇన్‌ఛార్జి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో చైతన్యం రావాలి

కళ్యాణదుర్గం టౌన్ : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థుల్లో చైతన్యం రావాలని వైసిపి విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నాయకులు షేక్షావలి, దొడగట్ట మురళి, ఓంప్రకాష్, ఇబ్రహీం, రోషన్, తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో ఉపాధి హామీ పనులు కల్పించడంతోపాటు సకాలంలో బిల్లులు చెల్లించాలని పలువురు కూలీలు కోరారు. ఈమేరకు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సాల్మన్, ఎపిఒ సుజాత వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు పెట్టకపోవడంతో కూలీలు వలసలు వెళ్తున్నారన్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కావున వెంటనే మండలంలోని కూలీలకు ఉపాధి పనులు కల్పించడంతోపాటు సకాలంలో బిల్లులు పడేలా చూడాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ, ఎపిఒ స్పందిస్తూ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య, వెంకటేష్, కప్పలకొండ రాజు, లక్ష్మి, చెన్నప్ప, నీరజ, అరుణ, లక్ష్మి, గోవిందు, ఆదినారాయణ, చిన్నమ్మ, శ్రీనివాసులు, శ్రీనివాసులు, వెంకట్రాముడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి వార్తకు స్పందన


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ లక్ష్మీశంకర్

ప్రజాశక్తి-కుందుర్పి

సచివాలయ సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ లక్ష్మీశంకర్ హెచ్చరించారు. మంగళవారం 'ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళతారో' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ మండలంలోని ఎర్రగుంట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల హాజరుపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఇదే తరహాలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బసాపురం, కుందుర్పి సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

పుట్లూరు : రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే సీజన్‌లో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సాగు సాగించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందన్నారు. ఈక్రమంలోనే 13వతేదీ సుబ్బరాయ సాగర్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నీరు పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులతోపాటు 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీరు చేరేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పంటల ఉత్పత్తి పెరిగేలా, రైతుల కష్టాలు తగ్గేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎర్రమట్టి తరలించేందుకు అనుమతివ్వాలని వినతి

బుక్కరాయసముద్రం : మండలంలో ఎర్రమట్టి, ఇసుర తోలుకునేందుకు అనుమతి ఇవ్వాలని పలువురు ట్రాక్టర్ల యజమానులు, హమాలీలు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ఎర్రమట్టి, ఇసుకను తోలుకునేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో కొందరు కొండలు, ప్రభుత్వ ఆస్తుల నుంచి తరలించుకోండంతో సమస్యలు వచ్చాయన్నారు. కావున ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎర్రమట్టి, ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని కోరారు.

వైభవంగా షర్మస్‌వలి షంషీర్

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన షర్మస్ వలి ఉరుసు ఉత్సవాలో లభాగంగా షంషీర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన షంషీర్ ఊరేగింపు మేళతాళాలు, డప్పు, వాయిద్యాల మధ్య సాగింది. ఉదయం 9 గంటలకు దర్గాకు చేరిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కణేకల్లు, బొమ్మనహాల్, డి.హీరేహాల్, పాల్తూరు, ఉరవకొండ, రాయదుర్గం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అనంతపురం : అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఎస్కెయు ఫార్మాస్యూటికల్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఉన్న చెత్త, ముళ్లకంపలను తొలగించారు. తర్వాత పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు సిబ్బంది జన్ సురక్షా క్యాంపెయిన్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పిఎంజెడివై, పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై, ఎపివై, ఎస్‌ఎస్‌వై వంటి పథకాల గురించి వివరించారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ డాక్టర్ కన్యాకుమారి 280 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 35 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీకుమార్‌రెడ్డి, ఎస్‌ఒ నాగరత్నబాయి, సిహెచ్‌ఒ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటరమణ, పిహెచ్‌ఎన్ సరోజమ్మ, ఎఎన్‌ఎం రాధమ్మ, వైద్య సిబ్బంది, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

'గేట్స్' విద్యార్థుల త్రీడి వాక్


త్రీడీ వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు

గుత్తి : జాతీయ విద్యాదినోత్సవం, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు వికె.సుధీర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని గుత్తిలో గేట్స్ విద్యార్థులు మంగళవారం త్రీడీ వాక్ (ర్యాలీ) నిర్వహించారు. పట్టణంలోని హోండా షోరూం నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వికె.శ్రీవాణి మాట్లాడుతూ వికె.సుధీర్‌రెడ్డి క్రమశిక్షణ, నిబద్ధత, దృఢ సంకల్పం అనే మూడు ప్రధాన విలువలతో ముందుకు సాగేవారన్నారు. ఆ విలువలు ప్రతిబింబించేలా త్రీడీ వాక్ అనే పేరుతో ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ప్రజాఉద్యమ' ర్యాలీకి తరలిరండి

కుందుర్పి : ఈనెల 12వతేదీ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా ఉద్యమ ర్యాలీకి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని వైసిపి మండల కన్వీనర్ హనుమంతురాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

మద్యం స్వాధీనం

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామ మలుపు వద్ద రాత్రి వేళ ముగ్గురు వ్యక్తులు అక్రమంగా మద్యం రవాణా చేస్తుండటంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 60 మద్యం కేసులు, బొలేరోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్కూటర్ చోరీ

పుట్లూరు : మండల కేంద్రానికి చెందిన బి.రామలింగేశ్వరరెడ్డి స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితడు తెలిపిన వివరాల మేరకు.. రామలింగారెడ్డి నాగిరెడ్డిపల్లి వద్ద ఉన్న తన తోట వద్ద రోడ్డుపై స్కూటీ ఆపి తోటలోకి వెళ్లినట్లు తెలిపారు. తిరిగి వచ్చి చూసే లోపు గుర్తు తెలియని దండుగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకుని పోలీసులకు సమాచార ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టినా ఆచూకీ తెలియలేదు.

అబుల్ కలాం అడుగు జాడల్లో నడుద్దాం

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అడుగు జాడల్లో పయనిద్దామని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియులోని పరిపాలన భవనంలో అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ భారత ప్రభుత్వంలో 11ఏళ్లపాటు విద్యాశాఖ మంత్రిగా పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. అలాంటి ఆయన జయంతికి గుర్తుగా నవంబర్ 11ను ఆజాద్ మైనారిటీస్ వెల్ఫేర్ డేగా జరుపుకుంటామన్నారు. అలాగే జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, సిబ్బంది కలిసి అబులకలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి.సత్యనారాయణ, సుబ్బారెడ్డి, పి.సుజాత, జి.ప్రశాంతి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగప్రసాద్ నాయుడు, బి.దుర్గాప్రసాద్, వి.బి.చిత్ర, సురేష్‌బాబు, సి.శోభాబిందు, టి.నారాయణరెడ్డి, ఎ.పి.శివకుమార్, శంకర్‌శేఖర్‌రాజు, ఎం.అంకారావు, శ్రీధర్, బి.ఓంప్రకాష్, ఎం.రామశేఖర్‌రెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకట శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అబుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ధర్మవరం రోడ్డు గ్యాస్ గోదాము వెనుక ఉన్న కాలనీవాసులో తాగునీటి సమస్య తీర్చాలని మహిళలు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీలో తాగునీటి సమస్యను వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు ఫోన్ చేసి తన సొంత నిధులు ఖర్చు చేసి రెండు ట్యాంకులు ఏర్పాటు చేయిస్తానని, పైప్‌లైన్ ద్వారా కొళాయిలు కూడా ఏర్పాటు చేసే పనులు చేపట్టాలని సూచించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

బెలుగుప్ప : రైతులు ఏమైనా భూ సమస్యలు ఉంటే గ్రామసభల్లో విన్నవించి సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆవులెన్న, గుండ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా రైతులు భూ సమస్యలు ఉంటే ఎలాంటి గొడవలు పడకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా గుండ్లపల్లిలో 11, ఆవులెన్న గ్రామంలో 9 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గుర్బ్రహ్మ, వీఆర్వో రమేష్‌స్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ : స్థానిక రుద్రంపేటలోని కల్వరి గ్రేస్ చర్చిలో అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా దేశంతోపాటు రాష్ట్రం, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ శామ్యూల్ పోలేపల్లి కంటి వైద్యం నిమిత్తము రూ.3వేలు, ఉరవకొండ కరకముక్కల పాస్టర్ పేతురుగారి చర్చి నిర్మాణం కోసం రూ.30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి.మార్కు, సెక్రటరీ జిఆర్ ఆనంద్, జాయింట్ సెక్రటరీ వి.మనస్సే, ట్రెజరర్ కె.జీవన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జహంగీర్ జాషువా, పాస్టర్లు విజయ్‌సింహ, ఛార్లెస్‌నాయక్, పాల్గొన్నారు.

గ్రామసభలు

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు, కుందనకోట, ఓబుళాపురం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ శేషసాయి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

అనంతపురం : నగరంలోని నాయక్‌నగర్, హమాలీ కాలనీ, అదిమూర్తి నగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు.

ఎస్‌టియు సభ్యత్వ నమోదు

బ్రహ్మసముద్రం : ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి, చెలిమిపల్లి, గుండిగానిపల్లి, వేపులపర్తి, గుడిపల్లి, పైదొడ్డి తదితర పాఠశాల్లో మంగళవారం సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్, బ్రహ్మసముద్రం డిష్ టీవీ నాయకులు చంద్రశేఖర్, తిప్పేస్వామి, హరిప్రసాద్, చంద్రశేఖర్, తిప్పేస్వామి, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'థాంక్యూ ఎమ్మెల్యే మేడం'

ఆధార్ కేంద్రం ఏర్పాటుపై విద్యార్థుల్లో హర్షం

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థుల సౌకర్యార్థం మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై విద్యార్థులు 'థాంక్యూ ఎమ్మెల్యే మేడం' అంటున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అపార్ ఐడి కోసం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ భాస్కర్‌ను ఆదేశించారు. దీంతో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యేతోపాటు ఎంపిడిఒకు విద్యార్థులు, తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

టిప్పు సుల్తాన్‌కు నివాళి

గుత్తి : టిప్పు సుల్తాన్ (మైసూర్ టైగర్) జయంతిని పురస్కరించుకుని గుత్తి కోట సంరక్షణ సమితి, ముస్లిం మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో మంగళవారం గుత్తి కోట వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చౌదరి విజయభాస్కర్, యువ నాయకుడు షఫీ, మాట్లాడుతూ గుత్తి కోటను 29 రాజులు పరిపాలించారన్నారు. ఇందులో భాగంగానే టిప్పు సుల్తాన్ జయంతిని పురస్కరించుకుని గుత్తి కోట వద్ద కుల మతాలకతీతంగా ఈరోజు ఆయన జయంతిని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ సలహాదారుడు బాబా సాహెబ్, ముస్లిం మైనారిటీ నాయకులు ఆర్టీసీ హుస్సేన్ పీరా, హెచ్ఎం రసూల్, షఫీ, ఖదీర్, అబ్దుల్, ఖురేషి అన్వర్, నిజాం, పూల మొహమ్మద్, మహబూబ్ బాషా, వెల్డింగ్ రౌఫ్, మాబు, చిరు, మల్లి తదితరులు పాల్గొన్నారు.



టిప్పు సుల్తాన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-గుత్తి

తిరుపతి న్యాయవాది ఎ.రాజశేఖర్‌పై హత్యాయత్నాన్ని నిరసిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుత్తిలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.డి.రత్నం, కార్యదర్శి నగదాని చంద్రశేఖర్ మాట్లాడుతూ తిరుపతిలో విధులు నిర్వహించే రాజశేఖర్ పుత్తూరు కోర్టుకు వెళ్లగా అక్కడ కేసుకు సంబంధించిన వ్యతిరేక వ్యక్తులు హత్యాయత్నం పాల్పడం హేయమైన చర్య అన్నారు. అందుకు నిరసనగా రెండు రోజులపాటు విధులు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు కె.మనోహర్‌బాబు, ఆర్.రామగోపాల్, ఆర్‌వి.చలపతి, కబీర్, చంద్రకాంత్‌రెడ్డి, సుదర్శనరావు, సుదర్శనరెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, శివకుమార్ ఆచారి, ధనుంజయ, విజయభాస్కర్, పరమేష్‌రెడ్డి, సుబ్రమణ్యం, క్రాంతికుమార్, విజయ శేఖరరాజు, జె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సిసి క్యాడెట్లతో అధ్యాపక బృందం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎన్‌సిసికి క్యాడెట్లను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం-6 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్లు రాజేష్, కైలాస్ కలిసి దాదాపు 21 మంది క్యాడెట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునీల్, బాల నరసింహులు, బాబు, ప్రశాంత్, వినోద్ కుమార్, గోవర్ధన్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి గ్రామసభలు

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఈనెల 15 నుంచి 22వ తేదీవ రకూ స్వమిత్వ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న చిలమకూరు, కొడుమూర్తి, 20న మేడికుర్తి, 21న మల్లగుండ్ల, 22న పాతపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

శింగనమల : మండల పరిధిలోని నాగులగుడ్డం తండా గ్రామంలో ఉన్న ఎంపిపి పాఠశాలను ఎంఇఒ నరసింహరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల రికార్డులతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. తర్వాత విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఇఒ నరసింహరావు

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పప్పుశనగ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఎడిఎ రవి, రేకులకుంట కెవికె శాస్త్రవేత్తలు ఆర్.నరసింహులు, కె.లక్ష్మణ్, జాహ్నవి, మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని ఎఇఒ చిన్న నాగిరెడ్డి, ఎంపిఇఒ నాగలింగేశ్వర్, సుధ, రైతులు పాల్గొన్నారు.

గుంతకల్ రూరల్: మండల పరిధిలోని దోసలుడికి, బుగ్గసంగాల గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారిణి లీనావసుంధర ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ రాజ్యలక్ష్మి, రైతులు నారాయణస్వామి, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని పాతపల్లి, జంగంపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటల సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. తర్వాత పప్పుశనగ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ మధుకుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కందిపంట పూత దశలో ఉండటంతో రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సి.ప్రసాద్, గ్రామ వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

అవినీతి రేషన్ డీలర్లపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

అవినీతికి పాల్పడుతున్న రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఎపి చేనేత సంఘం నాయకులు చింతా పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఉన్న రేషన్‌షాపు డీలర్ ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ముఖ్యంగా గ్రామానికి కిలోమీటర్ దూరంలో దుకాణం ఏర్పాటు చేసుకోవడం వల్ల రేషన్ తెచ్చుకోవాలంటే ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. కావున వెంటనే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతా సాంబశివుడు, అరుణోదయ బద్దల రమణ, గుండా సుబ్రమణ్య, ప్రజలు పాల్గొన్నారు.